సీహెచ్‌సీ.. నామ్‌కే వాస్తే

- గతేడాది పీహెచ్‌సీ నుంచి సీహెచ్‌సీగా రూపాంతరం
- పరికరాల కొరతతో ఇబ్బందులు
- సీజనల్ వ్యాధులతో ఆస్పత్రి కిటకిట

యాచారం: ఒక్కసారిగా మారిన వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వైద్యులు అంటున్నారు. హైదరాబాద్-నాగార్జునసాగర్ రహదారిపై యాచారం మండల కేంద్రంలో సామాజిక ఆరోగ్య కేంద్రం ఉంది. ఈ కేంద్రానికి యాచారం మండల రోగులే కాకుండా, మంచాల, కందుకూర్, ఇబ్రహీంపట్నం, నల్లగొండ జిల్లా చింతపల్లి, మర్రిగూడ మండలాల నుంచి రోగులు వస్తారు. ఈ ఆస్పత్రికి గతంలో ఎంతో పేరుండేది. ఆయా గ్రామాల నుంచి నిత్యం 200 మందికి పైగానే రోగులు వస్తారు. వారం రోజులుగా వాతావరణ మార్పుల వల్ల కాళ్లు, కీళ్లు, ఒళ్ల నొప్పులు, విష జ్వరాలు వంటి వ్యాధుల బారిన పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మంతన్‌గౌరెల్లి, మాల్, కొత్తపల్లి, తక్కళ్లపల్లి, నందివనపర్తి, మొండిగౌరెల్లి, నల్లవెల్లి, చింతుల్ల తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రోగులు వస్తారు. ఆస్పత్రిలో రక్త, మూత్ర తదితర పరీక్షలు నిర్వహించి కావాల్సిన మందులు అందజేస్తున్నారు. జ్వరాలు సోకి అస్వస్థతకు గురైన రోగులకు ఆస్పత్రిలోనే గ్లూకోజ్ బాటిల్స్ ఎక్కిస్తున్నారు. ఇంకా మెరుగైన వైద్యం అందజేయాల్సి వస్తే రోగులను మరిన్ని పరీక్షల కోసం ఇబ్రహీంపట్నంలోని క్లస్టర్ ఆస్పత్రికి, నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి పంపిస్తున్నారు.

ప్రైవేట్‌కు వెళ్తే దోపిడీ..

సీజనల్ వ్యాధులతో ప్రైవేట్ ఆస్పత్రులు కూడా కిటకిటలాడుతున్నాయి. మాల్ కేంద్రంలో ఉన్న పలు ప్రైవేట్ ఆస్పత్రులు ఇన్‌పేషెంట్స్‌తో నిండిపోతున్నాయి. జ్వరాలు సోకి ఆస్పత్రికి వెళ్తే వివిధ పరీక్షల పేరుతో వేలాది రూపాయలు వసూల్ చేస్తూ దోపిడీ చేస్తున్నారు. వర్షాలు కురుస్తున్నా కూడా గ్రామాల్లో నీటి ట్యాంకులు శుభ్రం చేయకపోవడంతో తాగేనీటిలో తోక పురుగులు వస్తున్నట్లు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామాలకు మిషన్ భగీరథ నీళ్లు సరఫరా అవుతున్నా ట్యాంకులను నెలనెలా శుభ్రం చేయడంలేదు. కలుషితమైన నీటిని సరఫరా చేయడంతో ప్రజలు రోగాలపాలు అవుతున్నారు. నీటి ట్యాంకుల శుభ్రతపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.



యాచారం సామాజిక ఆరోగ్య కేంద్రం

సామాజిక ఆరోగ్య కేంద్రంగా మార్పు..

యాచారం మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గతేడాది సామాజిక ఆరోగ్య కేంద్రంగా అప్‌గ్రేడ్ చేశారు. ఈ ఆస్పత్రి ప్రస్తుతం వైద్య విధాన పరిషత్ కింద మార్పుబడింది. ఆస్పత్రి పేరు మారిందే కాని సేవలు మాత్రం మారలేదు. కేవలం ఇద్దరు వైద్యులు, 14 మంది శానిటేషన్ సిబ్బందిని మాత్రమే నియమించారు. నియమించిన వైద్యులు కూడా సక్రమంగా ఆస్పత్రికి రావడం లేదని ఆరోపణలు ఉన్నాయి. నేటికీ పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని నియమించలేదు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు యాచారం ఆస్పత్రి ఎంతో పేరు పొందింది. కాని ఏడాది కాలంగా ఆస్పత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిలిపేశారు. పేద మహిళలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తూ అప్పులబారిన పడుతున్నారు.

అన్ని పరీక్షలు ఇక్కడే చేయాలి



వాతావరణ మార్పుతో జ్వరం రావడంతో వారం రోజులుగా శరీరం సహకరించడం లేదు. ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. రెండు రోజుల్లో జ్వరం తగ్గకుంటే రక్త, మూత్ర పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. అయితే మరికొన్ని టెస్టులు బయట ఆస్పత్రుల్లో చేయించుకోవాలని సూచించారు. ఆస్పత్రి సీహెచ్‌సీ స్థాయికి పెరిగింది. అన్ని టెస్టులు ఇక్కడే చేస్తే మాకు ఆర్థికభారం తగ్గుతుంది. – చెన్నమ్మ, చౌదర్‌పల్లి

నిత్యం 200 మంది వస్తున్నారు



యాచారం ఆస్పత్రికి నిత్యం 200 మందికి రోగులు వస్తున్నారు. అందులో సగానికి పైగా రోగులు కాళ్లు, కీళ్లు, ఒళ్లు నొప్పులు, జ్వరాలతో వస్తున్నావారే ఉంటున్నారు. రోగులకు పరీక్షలు నిర్వహించి మంచి మందులు అందజేస్తున్నాం. వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రారంభమయ్యాయి. ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. కాచి చల్లార్చిన నీటినే తాగాలి. – డాక్టర్ ప్రియాంక, వైద్యురాలు, యాచారం సీహెచ్‌సీ

ట్యాంకులు శుభ్రం చేయిస్తాం



వర్షాల నేపథ్యంలో నీరు కలుషితం కాకుండా ప్రతి గ్రామంలో ఉన్న నీటి ట్యాంకులను శుభ్రం చేయిస్తాం. ఎక్కడైనా నీటి పైప్‌లు లీకేజీలైతే వెంటనే మరమ్మతులు చేయిస్తాం. ప్రతి ట్యాంకుకు పైకప్పులు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కార్యదర్శులకు సూచిస్తాం. – విజయలక్ష్మి, ఎంపీడీఓ, యాచారం

క్లుప్తంగా

మండల కేంద్రంగా ప్రకటించాలి



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీఓ సూరజ్‌కుమార్‌కు, కందుకూర్‌లో అడిషనల్ కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు మంగళవారం వినతిపత్రాలను అందజేశారు. మండలం ఏర్పాటు కావడానికి గ్రామానికి అన్ని అర్హతలున్నాయన్నారు. 15 నుంచి 20 కి.మీ దూరంలో ఉన్న తలకొండపల్లి మండల కేంద్రానికి వెళ్లి పనులు చేసుకోవాలంటే మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు వైస్ ఎంపీపీ శ్రీనివాసురెడ్డి, రేణురెడ్డి, వెంకటయ్య, డేవిడ్, శరత్‌చంద్రశర్మ, రాజెందర్, జంగయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి: ఏబీవీపీ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా అని ఏబీవీపీ గ్రేటర్ హైదరాబాద్ జాయింట్ సెక్రటరీ వంగ సంజీవరెడ్డి మండిపడ్డారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. యూనివర్సిటీ పేరుతో అడ్మిషన్లు తీసుకొని సుమారు 4 వేల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న గురునానక్ కళాశాల యాజమాన్య దోపిడీ పాలకులకు కనిపించడంలేదా అని ప్రశ్నించారు. 50 రోజులుగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చేస్తున్నా ఎందుకు పాలకులు పట్టించుకోవడంలేదన్నారు. వెంటనే కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్టీ హాస్టల్‌లో వసతులు కల్పించండి: ఎన్‌ఎస్‌యూఐ

కడ్తాల్: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్ కోరారు. మంగళవారం స్థానిక ఎస్టీ బాలుర వసతి గృహన్ని ఎన్‌ఎస్‌యూఐ నాయకులు సందర్శించి.. వసతి గృహంలోని విద్యార్థులతో, వసతిగృహ సంక్షేమాధికారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వసతి గృహంలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ నాయకులు పవన్‌కల్యాణ్, దర్శన్, లడ్డు తదితరులు ఉన్నారు.

తుల్జాపూర్‌లో ఎమ్మెల్సీ పూజలు

ఆమనగల్లు: మహారాష్ట్రలోని తుల్జాపూర్‌లోని తుల్జాభవాని అమ్మవారి ఆలయాన్ని మంగళవారం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి సందర్శించారు. సీఎం కేసీఆర్‌తో పాటు మహారాష్ట్ర పర్యటనకు వెళ్లిన ఎమ్మెల్సీ పర్యటనలో భాగంగా తుల్జాపూర్‌లోని ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు.

'కౌశిక్‌రెడ్డిని పదవి నుంచి తొలగించాలి'

తలకొండపల్లి: ముదిరాజ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేసి ప్రజా ఒత్తిడి అనంతరం క్షమాపణ చెప్పిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డిపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని ముదిరాజ్ సంఘం చంద్రధన గ్రామ సొసైటీ అధ్యక్షుడు యాదిగిరి డిమాండ్ చేశారు. చంద్రధనలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్ మనోభావాలను దెబ్బతినేట్లుగా మాట్లాడిన పాడి కౌశిక్‌రెడ్డిని ఎమ్మెల్సీ పదవీ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కుమార్, ఉపసర్పంచ్ అనిల్, వెంకటేశ్, జంగయ్య, సత్యయ్య, రాఘవేందర్, గణేషు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

హుడాకాంప్లెక్స్: రాష్ట్ర క్రీడా పాఠశాలల్లో 4, 5వ తరగతులకు సంబంధించి (హకీంపేట, ఆదిలాబాద్, కరీంనగర్) ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా యువజన, క్రీడల అధికారి ఎర్రబెల్లి వెంకటేశ్వర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో మండల విద్యాధికారి ఆధ్వర్యంలో ఎంపికలను జూలై 5వ తేదీ లోపు నిర్వహిస్తారని, ఎంపికైన బాలబాలికలు మాత్రమే జిల్లాస్థాయిలో పాల్గొనుటకు అర్హులని పేర్కొన్నారు. 14వ తేదీన సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో మండల స్థాయిలో ఎంపికైన బాలబాలికలు జిల్లాస్థాయిలో నిర్వహించే ఎంపిక ప్రక్రియలో పాల్గొంటారని, జిల్లాస్థాయిలో ఎంపికై న వారిని మాత్రమే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని చెప్పారు. మూడు దశలలో జరిగే ఎంపికలో 4, 5వ తరగతుల్లో 10 మంది చొప్పున బాల, బాలికలను ఎంపిక చేస్తామన్నారు. 4వ తరగతి కోసం 8 నుంచి 9 సంవత్సరాల మధ్య వయస్సు, 5వ తరగతికి 9 నుంచి 10 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలని, బర్త్ సర్టిఫికేట్, ఆధార్‌కార్డు, కుల ధృవీకరణ పత్రం, ప్రొగ్రెస్ కార్డ్, బోనఫైడ్, పాస్ పోటోలు తీసుకుని రావాలని తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్: మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలో సోమవారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన మహ్మద్ జహంగీర్ పాషా కుటుంబాన్ని మంగళవారం కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలు పరామర్శించారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి రూ.5వేలు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ రూ.5 వేలు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, రావిచేడ్ గ్రామ కాంగ్రెస్ కమిటీ రూ.3 వేలు ఆర్థిక సాయం అందించారు. సర్పంచ్ భారతమ్మ, నాయకులు విఠలయ్యగౌడ్, మహిపాల్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, జనార్ధన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

మృతుని కుటుంబానికి..

ఆమనగల్లు: ఆమనగల్లు మండల పరిధిలోని నుచ్చుగుట్టతండాకు చెందిన నేనావత్ సికిందర్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను మంగళవారం ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు పరామర్శించి ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి సమకూర్చిన రూ.5వేలను అందించారు. నాయకులు మల్లేష్, నరేందర్, సందీప్, సంతోష్, సాయి పాల్గొన్నారు.

స్నేహితుని కుటుంబానికి...

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని నుచ్చుగుట్టతాండాలో ఆర్థిక ఇబ్బందులతో నేనావత్ రంజిత్ ఇటీవల మృతిచెందాడు. మృతిచెందిన రంజిత్ కుటుంబ సభ్యులకు తండాకు చెందిన స్నేహితులు మంగళవారం రూ.10 వేలు అందజేశారు. స్థానికులు శరత్, రాజు, దేవేందర్, పరమేశ్, కృష్ణ, నార్య, నరేందర్, విజయ్, రాజు, గన్యానాయక్, సీతారం, చందు, శివ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

సీఐ ఉపేందర్

ఆమనగల్లు: అంకితభావంతో పనిచేస్తే ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తుందని ఆమనగల్లు సీఐ ఉపేందర్ అన్నారు. ప్రజల సహకారంతోనే శాంతి భద్రతలు పరిరక్షణ సాధ్యమని అన్నారు. బదిలీపై వెళ్తున్న సీఐ ఉపేందర్, ఎస్‌ఐ సుందరయ్య, ఏఎస్‌ఐ నిరంజన్‌కు ఆమనగల్లు పట్టణంలోని పోలీసు స్టేషన్ ఆవరణలో మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఉపేందర్, ఎస్‌ఐ సుందరయ్యను ఆమనగల్లు ఎంపీపీ అనిత, జెడ్పీటీసీ అనురాధ, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్, వైస్ చైర్మన్ సత్యం, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, వివిద పార్టీల నాయకులు, అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ ఉపేందర్ మాట్లాడుతూ.. ప్రజల సహకారం, ప్రజాప్రతినిధుల, అధికారుల తోడ్పాటుతో ఆమనగల్లు సీఐగా సమర్థవంతంగా పనిచేయగలిగానని చెప్పారు. పోలీసు బాధ్యతలతో పాటు స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించామని ఆయన చెప్పారు. దాదాపు 800 మంది నిరుద్యోగ యువతకు పోలీసు ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ ఇవ్వడం తనకు సంతృప్తినిచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు కుమార్, సరిత, సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, అమర్‌సింగ్, సోన శ్రీనునాయక్, మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ నారాయణ, కౌన్సిలర్లు చెన్నకేశవులు, శేఖర్, అంబేద్కర్-పూలే జాతర కమిటీ వ్యవస్థాపకులు సుధాకర్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



సీఐ ఉపేందర్, ఎస్‌ఐ సత్యనారాయణను సన్మానిస్తున్న నాయకులు

క్విజ్ పోటీలను విజయవంతం చేయండి

కాంగ్రెస్ నేతల ఇంటింటి ప్రచారం



కరపత్రాలతో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: జూలై 2న నిర్వహించనున్న రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మక్తమాధారం గ్రామంలో ఎన్‌ఎస్‌యూఐ, కాంగ్రెస్ పార్టీ నాయకులు కరపత్రాలతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి మొదటి మూడు బహుమతులు ల్యాప్‌టాప్, స్మార్ట్ ఫోన్, ట్యాబ్, స్మార్ట్ వాచ్, ఇయర్‌ప్యాడ్స్, హర్డ్ డ్రైవ్, అలాగే నియోజకవర్గంలోని మహిళా టాపర్లకు ఎలక్ట్రిక్ స్కూటీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బాలరాజు, చంద్రయ్య, శ్రీకాంత్, శేఖర్ ఉన్నారు.

ఓటర్ సర్వేను పక్కాగా చేపట్టాలి

బీఎల్‌ఓలతో తహసీల్దార్ సమీక్ష

తలకొండపల్లి: ఓటర్ తుది జాబితాకనుగుణంగా ఇంటింటి సర్వే చేపట్టాలని తహసీల్దార్ కృష్ణ బీఎల్‌ఓలను ఆదేశించారు. మంగళవారం మండల రెవెన్యూ కార్యాలయంలో ఆయన బీఎల్‌ఓలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి వ్యక్తి యొక్క ఓటును ఫామ్-6 ద్వారా నమోదు చేయాలన్నారు. బీఎల్‌ఓలు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ ఇంట్లో ఉన్నాడా లేదా అని తనిఖీ చేయాలన్నారు. ఎవరైనా చనిపోయి ఉంటే ఓటర్ లిస్టు నుంచి ఫామ్-7 ద్వారా తీసివేయాలని తెలిపారు. ఒక్క వ్యక్తి యొక్క ఓటు రెండు ప్రదేశాల్లో నమోదై ఉంటే ఎక్కడ ఉంచుకుంటారని వారిని అడిగి వివరాలు సేకరించాలన్నారు. వారు కోరుకున్న ప్రదేశంలో ఓటును నమోదు చేయాలని చెప్పారు. పూర్తిచేసిన ఓటర్‌లిస్టు తుది జాబితాను ఈ నెలాఖరులోగా తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని బీఎల్‌ఓలకు సూచించారు. కార్యక్రమంలో డీటీ సంతోష్, సీనియర్ అసిస్టెంట్ బాలవర్దన్, ఆర్‌ఐ మంజుల, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

సులభ్ కాంప్లెక్స్ ఎక్కడ?

- అబ్దుల్లాపూర్‌మెట్‌లో సులభ్ కాంప్లెక్స్ లేక ప్రజల ఇబ్బందులు
- నిధులు మంజూరైనా ఏళ్లుగా పెండింగ్‌లోనే నిర్మాణం

అబ్దుల్లాపూర్‌మెట్: నగరానికి దీటుగా దినదినాభివృద్ధి చెందుతున్న అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో సులభ్ కాంప్లెక్స్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 20 గ్రామాలకు ప్రధాన కూడలితో పాటు వివిధ జిల్లాలకు ఇక్కడి నుంచి మార్గం ఉండటంతో ఈ మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం నిత్యం వేలాదిమంది రాకపోకలు కొనసాగిస్తుంటారు. వీరితో పాటు వందల సంఖ్యలో దుకాణ సముదాయాలు ఇక్కడ ఉన్నాయి. ఇక్కడ సులభ్ కాంప్లెక్స్ సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇక్కడ సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం మండల పరిషత్ నుంచి నిధులు మంజూరు అయినప్పటికీ అనువైన స్థలం లభించకపోవడంతో నిర్మాణం వాయిదా పడుతూ వస్తోంది.

మండలంగా ఏర్పాటైనా..


అబ్దుల్లాపూర్ కొత్త మండలంగా ఆవిర్భావం అయిన తర్వాత ఇక్కడ పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సబ్‌రిజిస్టార్ కార్యాలయాలు కూడా ఏర్పాటు కావడంతో ఆయా కార్యాలయాలకు వచ్చే ప్రజల సంఖ్య కూడా పెరుగుతూ వస్తోంది. సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం సత్వరమే చేపట్టాలని ప్రజాప్రతినిధులను కోరినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. పురుషులు ఐతే ద్విచక్ర వాహనాలపై కిలోమీటర్ దూరం వెళ్లి వస్తుంటారు. మరి మహిళల పరిస్థితి ఏంటి. వెంటనే సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



అబ్దుల్లాపూర్‌మెట్ ప్రధాన రహదారి

మాల్ మండల కేంద్రం అయ్యేనా?

- పదేళ్లుగా పోరాడుతున్న నాయకులు, ప్రజలు
- ఇర్విన్ మండల ఏర్పాటు ప్రకటనలతో కొత్త ఆశలు
- ఏకగ్రీవ తీర్మానాలు చేసిన గ్రామ పంచాయతీలు



మాల్ పట్టణం ఏరియల్ వ్యూ

యాచారం: రంగారెడ్డి-నల్లగొండ జిల్లాల సరిహద్దులోని మాల్ ప్రత్యేక మండల ఏర్పాటుపై ప్రజల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. రంగారెడ్డి-నల్లగొండ ఉమ్మడి జిల్లాల సరిహద్దులో ఉన్న మాల్ వ్యాపార కేంద్రానికి ఎంతో పేరుంది. నాగార్జునసాగర్-హైదరాబాద్ రహదారిపై ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా యాచారం మండల పరిధి, నల్లగొండ జిల్లా మర్రిగూడ, చింతపల్లి మండలాల పరిధిలో మాల్ వ్యాపార కేంద్రం విస్తరించి దినదినాభివృద్ధి చెందుతుంది. మాల్ కేంద్రం దాదాపు 250 ఎకరాలకు పైగా విస్తీర్ణం, 30వేలకు పైగా జనాభా కలిగి ఉంటుంది. దాదాపు 1,500కు పైగా వ్యాపార సముదాయాలు ఉండి, 10వేలకు పైగా పరోక్షంగా, ప్రత్యక్షంగా జీవనోపాధి పొందుతారు. ప్రతి మంగళవారం మాల్ కేంద్రంలో పశువుల సంత, మార్కెట్ కొనసాగుతుంది. ఇంత ప్రత్యేక గుర్తింపు ఉన్న మాల్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని పదేళ్లుగా ప్రజలు డిమాండ్ చేస్తున్నా పట్టించుకునే వారే లేరు. తాజాగా మాడ్గుల్ మండల పరిధిలోని ఇర్విన్‌ను కొత్త మండల కేంద్రంగా ప్రకటిస్తాం.. త్వరలో జీవో వస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ప్రకటనతో మాల్ మండల కేంద్రంపై ప్రజల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. ఇబ్రహీంపట్నం, దేవరకొండ, మునుగోడు నియోజవర్గాల ఎమ్మెల్యేలు చొరవ చూపితేనే మాల్ ప్రత్యేక మండల కేంద్రం ఏర్పాటు అయ్యే అవకాశం ఉంటుంది.

తీర్మానంతో వినతులు..

రంగారెడ్డి జిల్లా యాచారం మండల పరిధిలోని మాల్, తమ్మలోనిగూడ, నల్లవెల్లి, మంతన్‌గౌరెల్లి, కిషన్‌పల్లి, నల్లవెల్లి తండా గ్రామాలను, నల్లగొండ జిల్లా చింతపల్లి, మర్రిగూడ మండలాల పరిధిలో ఉన్న తమ్మడపల్లి, తిరుగండ్లపల్లి, గొడుకొండ్ల, రాంనగర్, తూర్పు తక్కళ్లపల్లి, మదనాపురం తదితర 20 గ్రామాలకు పైగా కలిపి మాల్‌ను ప్రత్యేక మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఆయా మండలాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పంచాయతీల్లో తీర్మానాలు చేసి ఇదివరకే ప్రభుత్వ పెద్దలకు వినతులు అందించారు. ప్రస్తుతం వీరికి నల్లగొండ జిల్లా కలెక్టరేట్ కేంద్రం 80 కిలోమీటర్లు, రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కేంద్రం (కొంగరకలాన్) 40 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. కొత్త వాహనాలు కొనుగోలు చేస్తే రిజిస్ట్రేషన్లకు 120 కిలోమీటర్ల దూరంలో ఉన్న మిర్యాలగూడకు, 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న మన్నెగూడకు వెళ్లాల్సి ఉంటుంది. మాల్ వ్యాపార కేంద్రంలో స్థిరాస్తి వ్యాపారం కూడా నగరంతో పోటీ పడుతుంది. గజం ధర రూ.10 వేల నుంచి రూ.50 వేలు దాటింది. ఎకరా భూమి ధర రూ.2 కోట్లకు పైగానే డిమాండ్ ఉంది.

అందుబాటులో ప్రభుత్వ భూమి..

రెండు జిల్లాల సరిహద్దులో ఉన్న మాల్ కేంద్రాన్ని ప్రత్యేక మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తే ఇక్కడ కార్యాలయాల నిర్మాణానికి కావాల్సిన ప్రభుత్వ భూమి సిద్ధంగా ఉంది. మాల్ కేంద్రం నడిబొడ్డులో మాల్ గ్రామ పంచాయతీ పరిధిలోని 640 సర్వేనంబరులో 16 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది.

పదేళ్లుగా అడుగుతున్నాం



మాల్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని పదేళ్లుగా అడుగుతున్నాం. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలోనే ఈ మేరకు ర్యాలీలు, ధర్నాలు చేసి ఎమ్మెల్యేలకు, మంత్రులకు వినతిపత్రాలు ఇచ్చాం. చిన్న గ్రామమైన ఇర్విన్‌ను మండల కేంద్రంగా ప్రకటించారు. మరి ఇన్ని ప్రత్యేకతలున్న మాల్‌ను మండల కేంద్రంగా ఎందుకు చేయరు. స్థానిక ఎమ్మెల్యే, నాయకులు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. – లక్ష్మణ్ సాగర్, కన్వీనర్, మాల్ ప్రత్యేక మండల కేంద్రం సాధన సమితి

ఏకగ్రీవ తీర్మానం చేశాం



సాగర్‌రోడ్డుపై ఉన్న మాల్ కేంద్రాన్ని ప్రత్యేక మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని గ్రామ పంచాయతీలో ఏకగ్రీవ తీర్మానం చేశాం. మాల్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేసి రంగారెడ్డి జిల్లా పరిధిలో కలుపాలి. ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలకు అవసరమైన ప్రభుత్వ స్థలం ఇక్కడ ఉంది. ప్రత్యేక మండలంతో మాల్‌కు గుర్తింపు వస్తుంది. – కవిత, సర్పంచ్, మాల్

మండల కేంద్రంగా ప్రకటించాలి



మాడ్గుల్ మండల పరిధిలోని ఇర్విన్‌ను ప్రత్యేక మండల కేంద్రంగా ప్రకటిస్తున్న దృష్ట్యా మాల్‌ను కూడా మండల కేంద్రం ప్రకటించాలి. త్వరలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇస్తాం. ఇర్విన్ కంటే వ్యాపార పరంగా మాల్ వంద రేట్లు అధికంగా ఉంటుంది. ప్రభుత్వం కూడా ఆలోచన చేసి నిర్ణయం తీసుకోవాలి. – జంగమ్మ, జెడ్పీటీసీ, యాచారం

పింఛన్ డబ్బులు ఇవ్వాలి: ఎంపీపీ

యాచారం: కార్డులు ఇచ్చిన వారందరికీ ఆసరా పింఛన్ డబ్బులు ఇవ్వాలని ఎంపీపీ కొప్పు సుకన్య డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ... మీసేవా కేంద్రాల్లో పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వమే కార్డులు మంజూరు చేసి ఇచ్చి నెలలు గడుస్తున్న అనేకమంది లబ్ధిదారులకు ఇంకా డబ్బులు అందడంలేదని అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని కార్డులు ఇచ్చిన వారందరికి పింఛన్ డబ్బులు అందజేయాలని కోరారు. పలు గ్రామాల నుంచి కార్డులుపొందిన లబ్ధిదారులు నిత్యం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసరా పింఛన్ల పంపిణీలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఇప్పటికీ చాలామంది అర్హులకు పింఛన్లు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పింఛన్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

'మేరా బూత్ సబ్సే మజ్బూత్'ను తిలకించిన నేతలు

యాచారం: ప్రధాని నరేంద్రమోడీ మధ్యప్రదేశ్ భోపాల్ నుంచి వర్చువల్‌గా మాట్లాడిన మేరా బూత్ సబ్సే మజ్బూత్ కార్యక్రమాన్ని యాచారంలో బీజేపీ శ్రేణులు తిలకించారు. మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ప్రధాని సందేశాన్ని టీవీ నుంచి తిలకించారు. బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని నేతలు అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్, బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులకు ట్యాబ్‌ల పంపిణీ



ప్రధానోపాధ్యాయులకు ట్యాబ్‌లు అందజేసిన నోడల్ అధికారి జంగయ్య

కడ్తాల్: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో మండల పరిధిలోని 23 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మంగళవారం ప్రభుత్వం నుంచి వచ్చిన ట్యాబ్‌లను మండల నోడల్ అధికారి జంగయ్య పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పద్మమ్మ, అరుణమ్మ, ఖలీల్ అహ్మద్, యాదయ్య, జహంగీర్, విద్యావతమ్మ, తిరుపతయ్య, రమాదేవి, రవీందర్‌రెడ్డి, సలోమి రాజకుమారి, ఎలిజబెత్, సంతోష్, విజయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి, నాగేశ్, భాగ్యమ్మ, కొండల్, అరుణ, విష్ణు, లత, రాధిక, కోఆర్డినేటర్ సాయి, సీఆర్‌పీలు మల్లేశ్, శ్రీరాములు ఉన్నారు.

ఒక యూనిట్ రక్తంతో ముగ్గురికి ప్రాణదానం

ఆర్టీసీ డిపో మేనేజర్ అశోక్‌రాజు

ఇబ్రహీంపట్నం: అన్నిదానాల కంటే రక్తదానం ఎంతో మిన్న అని.. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలు కాపాడేందుకు మీరిచ్చిన రక్తం ఎంతో ఉపయోగపడుతుందని ఆర్టీసీ డిపో మేనేజర్ అశోక్‌రాజు అన్నారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఒక్క యూనిట్ రక్తంతో ముగ్గురి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. రక్తదానం చేసేందుకు యువత ముందుకురావాలన్నారు. శిబిరంలో 37 మంది ఆర్టీసీ ఉద్యోగులు, 26 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. డిపో అసిస్టెంట్ మేనజర్ సరస్వతి, ఎంఎఫ్ సత్తయ్య, ఓఎస్ శ్రీనివాస్, హెడీఎఫ్‌సీ టీమ్, జీవధార రక్తదాన స్వచ్ఛంధ సంస్థ డాక్టర్ల బృందం పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఉద్యోగులు, యువకులు